క్లుప్తంగా

13న ఆటో డ్రైవర్ల నిరసన

మిర్యాలగూడ అర్బన్ : రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన మహాలక్ష్మి పథకంలో భాగంగా ఉచిత బస్ ప్రయాణం కల్పించడం ద్వారా ఉపాధి కోల్పోయామని 13వ తేదీన స్థానిక ఏరియా ఆస్పత్రిలో ఆటో డ్రైవర్లు, క్యాబ్ డ్రైవర్లు రక్తదానం చేసిన నిరసన తెలపనున్నట్లు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన హిట్ అండ్ రన్ చట్టం ద్వారా డ్రైవర్లకు ఉనికి కోల్పోయే పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి

నిడమనూరు : మండలంలోని వేంపాడ్‌లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విద్యుదాఘాతానికి గురై శిరసన గండ్ల అంగజయ్యకు చెందిన గేదె మృతి చెందింది. బాధితుడు అంజయ్య తెలిపిన వివరాల ప్రకారం రోజు వారిగా గురువారం మేత కోసం గేదెను పొలాల్లోకి తీసుకెళ్లగా వ్యవసాయ మోటార్లకు చెందిన ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు వెళ్లడంతో విద్యుదాఘాతానికి గురై మృతిచెందినట్లు తెలిపారు. ప్రభుత్వం తనను ఆదుకోవాలని కోరారు.

ఓపెన్ యూనివర్శిటీ అడ్మిషన్ల గడువు పెంపు

మిర్యాలగూడ అర్బన్ : డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం ఓపెన్ డిగ్రీలో ప్రవేశాలకు గడువు చివరి తేదీ ఈనెల 31 వరకు పొడిగించినట్లు కేఎన్ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాల స్టడీ సెంటర్ కో ఆర్డినేటర్ నర్సింగ్ కోటయ్య తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. పదోతరగతి, ఇంటర్మీడియట్, ఓపెన్ ఇంటర్, పాలిటెక్నిక్ డిప్లొమా, రెండు సంవత్సరాల ఐటీఐని పూర్తి చేసిన వారు ఓపెన్ డిగ్రీ ప్రవేశాలకు అర్హులని వివరించారు. వివరాలకు స్టడీ సెంటర్ 7382929640ను సంప్రదించాలని సూచించారు.

చెంచులు ఆర్థికంగా బలోపేతం కావాలి

చందంపేట : చెంచులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కల్పిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా బలోపేతం కావాలని డీఆర్‌డీఏ రాజ్‌కుమార్ అన్నారు. పీఎం జన్మాన్ కార్యక్రమంలో భాగంగా గురువారం నేరెడుగొమ్ము ఆశ్రమ పాఠశాలలో చెంచు గిరిజనులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు. అన్ని రకాలుగా అర్హతలు ఉన్న వారు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపిడివో రాములునాయక్, ఝాన్సీ లక్ష్మిబాయి, వార్డెన్ లింగయ్య, జెడ్పీటీసీ బాలునాయక్ ఉన్నారు.

ముమ్మరంగా దరఖాస్తుల డేటా ఎంట్రీ

వేములపల్లి : ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా ప్రజల నుంచి స్వీకరించిన దరఖాస్తుల ఆన్‌లైన్ డేటా ఎంట్రీ ప్రక్రియ జిల్లాలోని అన్ని మండలాల కంటే వేములపల్లి మండలంలో వేగవంతంగా జరుగుతున్నట్లు మండల స్పెషల్ ఆఫీసర్ మక్బుల్‌అహ్మద్ అన్నారు. గురువారం ఆయన మండల కేంద్రంలో చేపడుతున్న డేటా ఎంట్రీని ఎంపీపీ పుట్టల సునీత, తహసీల్దార్ శ్రీనివాస్‌శర్మలతో కలిసి పరిశీలించారు.

ప్రయాణికుడిపై అద్దె బస్సు డ్రైవర్ దాడి

- ప్రయాణికుడికి గాయాలు, బస్టాండ్ ఎదుట దర్నా

మిర్యాలగూడ అర్బన్: ప్రయాణికుడిని అద్దె బస్సు డ్రైవర్ దాడి చేసి గాయపరిచాడు. ఈ ఘటన గురువారం మిర్యాలగూడ పట్టణంలో జరిగింది. బాధితుడి బంధువులు, ప్రయాణికులు తెలిపిన వివరాల ప్రకారం.. నల్లగొండ పట్టణానికి చెందిన పగిళ్ల వెంకన్న తన భార్య ఆండాల్‌తో కలిసి మిర్యాలగూడ బస్టాండ్‌లో నల్లగొండకు వెళ్లే ఆర్డినరీ అద్దె బస్సు ఎక్కారు. బస్సును డ్రైవర్ పక్కకు నిలిపాడు. ఇదే విషయమై డ్రైవర్‌ను ఎస్‌కే రజాక్ ప్రశ్నించగా.. వెంకన్నతో డ్రైవర్ దురుసుగా మాట్లాడాడు. దీంతో ఇరువురి మధ్య వాగ్వాదం జరగడంతో బస్సు దిగి వెళ్లిపోతున్న వెంకన్నపై డ్రైవర్ రజాక్ కర్రతో విచక్షణారహితంగా దాడి చేశాడు. ఈ దాడిలో వెంకన్న ముఖంపై తీవ్ర గాయాలయ్యాయి. దీంతో బాధితుడి బంధువులు బస్టాండ్ ఎదుట ఆందోళన చేపట్టారు. వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడ్డాయి. విషయం తెలుసుకున్న మిర్యాలగూడ టూటౌన్ బస్టాండ్ వద్దకు చేరుకుని ప్రయాణికుడి బంధువులకు నచ్చజెప్పడంతో ఆందోళన విరమించారు. ఇదే విషయమై డిపో మేనేజర్ పాల్‌ను వివరణ కోరగా.. జరిగిన ఘటనపై విచారణ జరిపించి తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కలెక్టర్‌కు శుభాకాంక్షలు



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న నాగిరెడ్డి

మాడుగులపల్లి మండలం ధర్మాపురం గ్రామానికి చెందిన సివిల్ కాంట్రాక్టర్ చింతరెడ్డి నాగిరెడ్డి గురువారం కలెక్టర్ హరిచందనను కలెక్టరేట్‌లో కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

విద్యాసంస్థల్లో సంక్రాంతి సంబరాలు

ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థల్లో గురువారం ముందస్తు సంక్రాంతి సంబరాలను ఘనంగా జరుపుకున్నారు. విద్యార్థినులు ముగుల పోటీల్లో పాల్గొని అందంగా రంగవల్లులు వేశారు. పలు పాఠశాలల్లో భోగిమంటలు వేసి ఆనందంగా గడిపారు. చిన్నారులపై భోగిపళ్లు పోసి పూజలు చేశారు. విద్యార్థులు వివిధ వేషధారణలలో అందరినీ ఆకర్షించారు.

– సాక్షినెట్ వర్క్



తిరుమలగిరి : దిగ్రేట్‌వే పాఠశాలలో చిన్నారులపై భోగిపళ్లు పోసి ఆశీర్వదిస్తున్న టీచర్లు



మిర్యాలగూడ : వర్డ్ అండ్ డీడ్ పాఠశాలలో ముగ్గులు వేస్తున్న విద్యార్థినులు



హాలియా : సంక్రాంతి సంబురాల్లో టైం స్కూల్ ఉపాధ్యాయులు, విద్యార్థులు



పెద్దవూర : న్యూకిడ్స్‌లో భోగి మంటలు వేస్తున్న ఉపాధ్యాయులు



మిర్యాలగూడ : సంక్రాంతి వేడుకల్లో పాల్గొన్న శిష్య పాఠశాల చిన్నారులు, ఉపాధ్యాయులు



మిర్యాలగూడ : ముగ్గులు వేస్తున్న లిటిల్‌ఫ్లవర్ పాఠశాల విద్యార్థులు



గుర్రంపోడు : పిట్టలగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో..



అడవిదేవులపల్లి : దిష్రిగ్రేట్‌వే పాఠశాలలో..



మిర్యాలగూడ అర్బన్ : సంక్రాంతి సందర్భంగా ముగ్గులు వేస్తున్న విద్యార్థులు



డిండి : కందుకూర్ పాఠశాలలో ముగ్గులు వేస్తున్న విద్యార్థినులు

వివేకానందుడి జీవితం స్ఫూర్తిదాయకం

హాలియా : స్వామి వివేకానంద జీవితం యువతకు ఆదర్శనీయమని చల్మారెడ్డిగూడెం హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు దాసా వెంకన్న అన్నారు. అనుముల మండలంలోని చల్మారెడ్డిగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల్లో గురువారం స్వామి వివేకానంద 161వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈసంరద్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం హెచ్‌ఎం మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు అమృతయ్య, నిర్మల, సైదులు రావు గౌతమ్, రామకృష్ణ, సునిత, శ్యామల దేవి, మల్లిఖార్జున్, యాదగిరి, చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

కొండమల్లేపల్లి : కొండమల్లేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలతో పాటు సాయి సిద్ధార్థ ఉన్నత పాఠశాల పలు పాఠశాలల్లో గురువారం ఏబీవీపీ ఆధ్వర్యంలో స్వామి వివేకానంద జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాలల వేసి నివాళులర్పించారు. అనంతరం ఏబీవీపీ నాయకులు యలమల గోపిచంద్ మాట్లాడుతూ జనవరి 12న స్వామి వివేకానంద జయంతిని జాతీయ యువత దినోత్సవంగా జరుపుకుంటారని, విద్యార్థులు, యువత వివేకానంద జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకొని ముందుకు సాగాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పెరికేటి ఆకాశ్, పెనువెల్లి హనుమంత్, పాగాకు రవీందర్, పవన్ తదితరులు పాల్గొన్నారు.



కొండమల్లేపల్లి : వివేకానంద చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

గ్రామాల్లో తాగునీటి సమస్య పరిష్కరించాలి



ఎమ్మెల్యే లక్ష్మారెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

మిర్యాలగూడ : మండలంలోని వెంకటాద్రిపాలెం, జంకుతండా గ్రామపంచాయతీల్లోని రాజీవ్‌నగర్, జంగాలకాలనీల్లో తాగునీటి సమస్యను పరిష్కరించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. గురువారం ఆయా గ్రామాల ప్రజలు తాగునీటి సమస్యను పరిష్కరించాలని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు గ్రామస్తులు మాట్లాడుతూ పాలకులు మారినా మంచినీటి సమస్య పరిష్కారం కావడం లేదన్నారు. గత ప్రభుత్వ బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఇంటింటికి మిషన్ భగీరథ నీళ్లు ఇస్తామని పైపులైన్ వేసి నల్లాలు బిగించారు కానీ నీటి సరఫరా మాత్రం చేయలేదన్నారు. ఇప్పటికైనా నూతన ప్రభుత్వమైనా మా గ్రామాల్లో తాగునీటి సమస్యను పరిష్కరించి ప్రజల ఇబ్బందులను తొలగించాలని కోరారు. వినతిపత్రం అందించిన వారిలో సజ్జల రవీందర్ రెడ్డి, భీమ్లానాయక్, ఉమెర్, జావీద్, వజీర్‌ఖాన్, వసీం, షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్పతినాయక్ సేవలు మరువలేనివి

మిర్యాలగూడ : ప్రభుత్వ విద్యావ్యవస్థ బలోపేతానికి లక్ష్పతినాయక్ చేసిన సేవలు ఎనలేనివని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో లక్ష్పతినాయక్ మెమోరియల్ ట్రస్టును ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి, నిరుపేద విద్యార్థుల్లో విద్యానైపుణ్యాలను పెంచడానికి లక్ష్పతినాయక్ కుటుంబసభ్యులు మెమోరియల్ ట్రస్టును ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ బాలాజీనాయక్, ట్రస్ట్ చైర్మన్ పానుగోతు గోపినాథ్, సభ్యులు డాకునాయక్, అజయ్, విజయ్, జీవన్, పద్మ పాల్గొన్నారు.



లక్ష్పతినాయక్ ట్రస్ట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

రోడ్ల అభివృద్ధి పనులపై ఎమ్మెల్యే సమీక్ష

నాగార్జునసాగర్ : నియోజకవర్గంలోని రోడ్ల అభివృద్ధి పనులపై సాగర్ ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి, మాజీమంత్రి జానారెడ్డి ఆర్‌అండ్‌బీ శాఖ అధికారులతో నాగార్జునసాగర్‌లోని వారి నివాసంలో గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. పంచాయతీ రాజ్, రాష్ట్ర, జాతీయ స్థాయి రహదారులు ఎన్నెన్నీ కిలోమీటర్లు ఉన్నాయి. మరమ్మతులు చేయాల్సిన ఆవశ్యక్త కలిగిన రోడ్లు ఎంటీ, కొత్త రోడ్లు వేయాల్సినవి ఎన్ని, ప్రస్తుతం రోడ్ల పనులు ఎక్కడెక్కడ జరుగుతున్నాయనే అంశాలపై చర్చించారు. ఈ సమావేశంలో ఆర్‌అండ్‌బీ ఈఈ మిర్యాలగూడ పి.ఖాజన్‌గౌడ్, డిప్యూటీ ఈఈ మిర్యాలగూడ గణేష్‌కుమార్, ఏఈఈ పెద్దవూర శ్రీనివాస్, కనగల్, గుర్రంపోడ్ ఏఈఈ పి.అనిత, ఆర్‌అండ్‌బీ ఈఈ నల్లగొండ యాకూబ్ నల్లగొండ జిల్లా పరిషత్ మాజీ వైస్ చైర్మన్ కర్నాటి లింగారెడ్డి పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి, మాజీమంత్రి జానారెడ్డి

హామీలన్నీ అమలు చేస్తాం

తిరుమలగిరి(నాగార్జునసాగర్): ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేసి రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజల మన్ననలు పొందుతామని ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి అన్నారు. సీపీఎం పార్టీ మాజీ మండల కార్యదర్శి కొర్ర శంకర్ నాయక్ గురువారం నాగార్జునసాగర్‌లోని ఎమ్మెల్యే నివాసంలో కాంగ్రెస్‌లో చేరారు. ఆయనకు ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి పార్టీ కండువాకప్పి ఆహ్వానించారు. కొత్త, పాత అనే తారతమ్యం లేకుండా ప్రతి ఒక్కరూ పార్టీ బలోపేతం కోసం పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కాంసాని చంద్రశేఖర్, నాయకులు శ్రీధర్‌రెడ్డి, ప్రవీణ్, భీమ్లానాయక్ పాల్గొన్నారు.

ఆత్మహత్య కేసులో నలుగురు రిమాండ్



కేసు వివరాలు వెల్లడిస్తున్న సీఐ సత్యనారాయణ

మాడుగులపల్లి : భర్తను మానసికంగా వేధించి అతడి ఆత్మహత్యకు కారణమైన భార్యతోపాటు మరో ముగ్గురిని మాడుగులపల్లి పోలీసులు గురువారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. మాడుగులపల్లి పోలీస్ స్టేషన్‌లో మిర్యాలగూడ రూరల్ సీఐ సత్యనారాయణ, ఎస్ఐ నరేష్ కుమార్‌తో కలిసి నిందితులను మీడియా ఎదుట ప్రవేశపెట్టి కేసు పూర్వాపరాలు వెల్లడించారు. మిర్యాలగూడ మండలం గోగువారిగూడెం గ్రామానికి చెందిన గోవిందరావు (32)కు పట్టణంలోని ఇందిరమ్మ కాలనీకి చెందిన శ్రీవిద్యకు ఏడాది క్రితం వివాహమైంది. నాటి నుంచి అతడు అత్తవారింట్లోనే ఉంటూ వ్యవసాయం చేస్తున్నాడు. ఈ క్రమంలో భార్యతోపాటు ఆమె కుటుంబీకులతో గోవిందరావుకు మనస్పర్థలు వచ్చి కొంతకాలంగా గొడవలు జరుగుతున్నాయి. గతేడాది డిసెంబర్ 28న భార్యతోపాటు అత్తమామలు, బావమరిది గోవిందరావుతో గొడవపడి దాడి చేశారు. దీంతో మనోవేదనకు లోనైన అతడు పెద్దదేవులపల్లి శివారులో పురుగులమందు తాగి బలవన్మరణానికి పాల్పడ్డాడు. మృతుడి సోదరుడు సైదారావు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పరారీలో ఉన్న నలుగురు నిందితులను ఇందిరమ్మ కాలనీలోని వారి నివాసంలో గురువారం అదుపులోకి తీసుకొని మిర్యాలగూడ కోర్టులో రిమాండ్ చేసినట్లు సీఐ వెల్లడించారు.

అంకితభావంతో పనిచేస్తేనే గుర్తింపు

మాడుగులపల్లి : అంకితభావంతో పనిచేసే ప్రభుత్వ ఉపాధ్యాయులకు సమాజంలో ప్రత్యేక గుర్తింపు ఉంటుందని ఎఫ్ఎల్ఎన్ (ఫౌండేషన్ లిటరసీ అండ్ న్యూమరసీ) నోడల్ అధికారి వెంకటమ్మ అన్నారు. మాడుగులపల్లి జెడ్పీహెచ్ఎస్ హెచ్ఎం నరసింహ నాయక్ ఇటీవల బదిలీ కాగా గురువారం పాఠశాల సిబ్బంది ఏర్పాటు చేసిన వీడ్కోలు సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పాఠశాల అభ్యున్నతికి నరసింహ నాయక్ చేసిన సేవలనుకొనియాడారు. అనంతరం ఉపాధ్యాయులు శాలువా, పూలమాలతో ఆయనను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు నాగేశ్వర్‌రావు, వెంకట్రాములు, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీలత, వినోద, సిబ్బంది భాగ్యావతి, భగవంతరెడ్డి, పద్మ, యాదగిరి, విద్యార్థులు పాల్గొన్నారు.



నరసింహనాయక్‌ను సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

హక్కుల సాధనకు ఐక్యంగా ఉద్యమించాలి

మిర్యాలగూడ టౌన్ : యాదవులు తమ హక్కుల సాధన కోసం ఐక్యంగా ఉద్యమించాలని డాక్టర్ రమాదేవి, కౌన్సిలర్లు మల్గం రమేష్, చల్లా నాగమ్మ వెంకన్న అన్నారు. గురువారం పట్టణంలోని నాగార్జున నగర్‌లో గల యాదవ భవనంలో జర్నలిస్టు జంగా లక్ష్మణ్ యాదవ్ ఆధ్వర్యంలో నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. సంఘం పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాస్ యాదవ్, శ్రీనివాస్ యాదవ్‌ల అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో బీసీ ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి వెంకన్న యాదవ్, మట్టపల్లి సైదులు యాదవ్, అర్జున్‌రావు యాదవ్, డివిజన్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు కోటయ్య యాదవ్, కాశీ యాదవ్, జిల్లా సాంస్కృతిక కార్యదర్శి మల్లేష్ యాదవ్, లింగరాజు, నందకిశోర్ యాదవ్, మహేష్, వెంకన్న, లింగయ్య, మల్లయ్య యాదవ్, శ్రీనివాస్, మురళి, రొండి శ్రీనివాస్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఆడపిల్లల చదువు దేశానికే వెలుగు

మాడుగులపల్లి : ఆడ పిల్లలకు చదువుకుంటే విజ్ఞానంతో ఇంటితోపాటు దేశానికి వెలుగునిస్తారని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రజిని అన్నారు. 'బేటీ బచావో– బేటీ పడావో' కార్యక్రమంలో భాగంగా గురువారం మండలంలోని పాములపహాడ్ జెడ్పీహెచ్ఎస్ విద్యార్థినులకు సామాజిక అంశాలపై ఆమె అవగాహన కల్పించారు. బాల్య వివాహాలతో జరిగే అనర్థాలు, వ్యక్తిగత పరిశుభ్రత, పౌష్టికాహారం ఆవశ్యకతను వివరించారు. బాలల హక్కులు ఉల్లంఘనకు గురైతే చైల్డ్ హెల్ప్‌లైన్ 1098, 100 నంబర్లకు ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం నంద్యాల లక్ష్మారెడ్డి, అంగన్‌వాడీ టీచర్లు లలిత, లక్ష్మి, జయమ్మ తదితరులు పాల్గొన్నారు.

హాలియా : అనుముల ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో గురువారం అనుముల మండలంలోని కొత్తపల్లి జిల్లా పరిషత్ పాఠశాల్లో నిర్వహించిన బకేటీ బచావో..బేటీ పడావో కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. లింగ వివక్షత, బాల్య వివాహాలు, లైంగిక వేదింపులు, అత్యాచారాలు, భ్రూణ హత్యలు, బాల కార్మికత, అక్రమ రవాణకు గురికాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సూపర్ వైజర్ రమాదేవి, స్కూల్ హెడ్‌మాస్టర్ విజయలక్ష్మి, ఉపాధ్యాయులు జ్యోతి, వెంకటేశ్వర్లు, కుర్మారెడ్డి నాజీంసుల్తానా, హేమలత, వాణి, టీచర్ వజ్రమ్మ, బాలికలు ఉన్నారు.



హాలియా : కొత్తపల్లి హైస్కూల్‌లో అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ అధికారులు

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

పెద్దవూర: బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని, బాలికలకు 18 ఏళ్లు, బాలురకు 21 ఏళ్లు నిండిన తర్వాతనే వివాహాలు చేయాలని ఐసీడీఎస్ చలకుర్తి సెక్టార్ సూపర్‌వైజర్ ఎండీ. గౌసియాబేగం అన్నారు. గురువారం మండలంలోని చలకుర్తి జెడ్పీహెచ్ఎస్‌లో బేటీ బచావో.. బేటీ పడావో పై విద్యార్థినులకు అవగాహన కల్పించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం ఝాన్సీలక్ష్మీ, ఉపాధ్యాయులు జార్జ్, ఉమామహేశ్వరి, రేణుక, సహదేవి, జెస్సికా, నారాయణరెడ్డి, షాబుద్దీన్, అంగన్‌వాడీ టీచర్లు శాంత, పాల్గొన్నారు.



పెద్దవూర: చలకుర్తిలో మాట్లాడుతున్న గౌసియాబేగం

మహిళలు, బాలికల భద్రత కోసమే షీ టీం

మిర్యాలగూడ టౌన్ : మహిళలు, బాలికల భద్రత కోసమే షీ టీం పనిచేస్తుందని మిర్యాలగూడ రూరల్ సీఐ ముత్తినేని సత్యనారాయణ, షీటీం సీఐ గోపి అన్నారు. గురువారం మిర్యాలగూడ మండలం తుంగపాడు ఆదర్శ పాఠశాలలో నల్లగొండ టీ షీం ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో వారు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మిర్యాలగూడ రూరల్ ఎస్ఐ దోరేపల్లి నర్సింహులు, షీ టీమ్ ఎస్ఐ కోటేష్, షీటీమ్ ఏఎస్ఐ తబిత, పాఠశాల ప్రిన్సిపల్ సుజాతలతో పాటు పోలీసులు, ఉపాధ్యాయులు తదితరులున్నారు.

టీ హబ్‌ను సందర్శించిన 'మినా' విద్యార్థినులు



టీ హబ్ వద్ద మినా ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థినులు, లెక్చరర్లు

మిర్యాలగూడ : హైదరాబాద్‌లోని ప్రతిష్టాత్మకమైన టీ హబ్‌ను గురువారం పట్టణంలో గల మినా మహిళా ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థినులు సందర్శించారు. ఈ సందర్భంగా కంపెనీ ప్రతినిధులు టీ హబ్ పనిచేసే విధానం, సాంకేతిక నైపుణ్యత, అభివృద్ధికి ఏ విధమైన తోడ్పాటునందిస్తుంది, స్టార్టప్స్ ఏ విధంగా ఉపయోగించుకోవాలనే అంశాలను విద్యార్థినులకు వివరించారు. ఈ కార్యక్రమంలో సీఎస్సీ విభాగాధిపతులు మహేష్, భారతి, ఫయాజ్, ప్రియాంక పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు బావిలో పడి వ్యక్తి మృతి

మిర్యాలగూడ టౌన్ : ప్రమాదవశాత్తు బావిలో పడి వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన గురువారం మిర్యాలగూడ మండలంలోని జప్తివీరప్పగూడెంలో జరిగింది. మిర్యాలగూడ రూరల్ ఎస్ఐ దోరేపల్లి నర్సింహులు తెలిపిన వివరాల ప్రకారం.. జప్తివీరప్పగూడెం గ్రామానికి చెందిన కుంటిగొర్ల రమేష్(40) బుధవారం గ్రామ సమీపంలో గల వ్యవసాయ బావి వద్ద ఉన్న కల్వర్టుపై కూర్చోగా సెల్‌ఫోన్ బావిలో పడిపోయింది. ఫోన్ కోసం వెళ్లి ప్రమాదవశాత్తు బావిలో పడిపోవడంతో ఊపిరి ఆడక మృతిచెందాడు. తెలిపారు. వ్యవసాయ బావికి చెందిన రైతు సోమవారం ఉదయం పని నిమిత్తం బావి వద్దకు రాగా మృతదేహం నీటిపై తేలియాడుతుండటంతో స్థానికులకు సమాచారం ఇచ్చాడు. స్థానికులు రూరల్ పోలీసులకు సమాచారం అందించారు. మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మిర్యాలగూడ రూరల్ సీఐ సత్యనారాయణ ఘటనా స్థలానికి చేరకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు.

సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యేకు వినతి

డిండి: మండల పరిధిలోని జేత్య తండా గ్రామపంచాయతీలో వర్కర్‌గా పని చేస్తున్న రమావత్ జవహర్ (వికలాంగుడు) బాపన్‌కుంట సమీపంలో అటుగా వస్తున్న ఎమ్మెల్యే కారును ఆపాలని చేయి ఎత్తాడు. ఇది గమనించిన ఎమ్మెల్యే బాలునాయక్ వాహనం ఆపి జవహర్ వద్దకు వెళ్లాడు. ఈ సందర్భంగా జవహర్ పంచాయతీల్లో పనిచేస్తున్న వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని కోరాడు. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కరించే విధంగంగా తాను కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కార్మికుడిగా పనిచేస్తున్న వికలాంగుడిని చూసి ఎమ్మెల్యే బాలునాయక్ కాన్వాయ్ ఆపి సమస్య తెలుసుకోవడంపై ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.



వికలాంగుడికి నమస్కారం చేస్తున్న ఎమ్మెల్యే

తాటిచెట్టు పైనుంచి పడి గీత కార్మికుడికి గాయాలు

మిర్యాలగూడ టౌన్: ప్రమాదవశాత్తు తాటిచెట్టు పైనుంచి పడి గీత కార్మికుడికి గాయాలయ్యాయి. ఈ ఘటన గురువారం మిర్యాలగూడ మండలంలోని తక్కెళ్లపాడులో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... తక్కెళ్లపాడు గ్రామానికి చెందిన నర్సింగుల సోమయ్య గురువారం కల్లు గీసేందుకు గ్రామ సమీపంలో తాటిచెట్టు ఎక్కుతుండగా ప్రమాదశాత్తు చెట్టు పైనుంచి జారి కింద పడిపోయాడు. తీవ్ర గాయాల పాలైన సోమయ్యను చికిత్స నిమిత్తం స్థానికులు మిర్యాలగూడలోని ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం కుటుంబ సభ్యులు హైదరాబాద్‌కు తీసుకెళ్లారు. సోమయ్యను ప్రభుత్వం ఆదుకోవాలని కల్లుగీత కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సీహెచ్. సీతారాములు డిమాండ్ చేశారు. గురువారం సోమయ్యను ఆయన పరమర్శించారు. సోమయ్యకు ఉచిత వైద్యంతో పాటు ఎక్స్‌గ్రేషియాను చెల్లించాలని డిమాండ్ చేశారు. పరామర్శించిన వారిలో రైతు సంఘం జిల్లా నాయకుడు సీహెచ్ వెంకన్న, కల్లుగీత కార్మిక సంఘం నాయకులు గబ్బిలాల సోమయ్య, గుండు నాగయ్య, గజ్జి శేఖర్, గోవుల రామయ్య తదితరులున్నారు.

జాతీయ యువజనోత్సవాలకు అజయ్ ఎంపిక



మిర్యాలగూడ టౌన్ : మహారాష్ట్రలోని నాసిక్‌లో ఈనెల 12వ తేది నుంచి 17వ తేది వరకు జరగనున్న 27వ జాతీయ యువజన ఉత్సవాలకు మిర్యాలగూడలోని సీతారాంపురానికి చెందిన నేరేళ్ల అజయ్‌కు గురువారం ఆహ్వానం అందింది. ఈ ఉత్సవాలు స్వామి వివేకానంద జయంతి సందర్భంగా కేంద్ర, యువజన, క్రీడలశాఖ ఆధ్వర్యంలో వారం రోజుల పాటు నిర్వహించనున్నారు. దేశ ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ప్రారంభించనున్న ఈ కార్యక్రమానికి తనకు ఆహ్వానం రావడం చాలా ఆనందంగా ఉందన్నారు.